16న ఇంజనీరింగ్ తొలివిడత సీట్ల కేటాయింపు

- ముగిసిన వెబ్ఆప్షన్ల నమోదు ప్రక్రియ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో వెబ్ఆప్షన్ల నమోదు గడువు బుధవారంతో ముగిసింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 75,172 మంది వెబ్ఆప్షన్లు నమోదు చేశారని వివరించారు. వారు 49,42,005 ఆప్షన్లు నమోదు చేశారని తెలిపారు. ఒక అభ్యర్థి అత్యధికంగా 1,109 ఆప్షన్లను సమర్పించారని పేర్కొన్నారు. ఈనెల 16న ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో తొలివిడత సీట్లు కేటాయిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 155 ఇంజనీరింగ్ కాలేజీల్లో 1,07,039 సీట్లున్నాయి. వాటిలో కన్వీనర్ కోటాలో 76,359 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ధరణి రద్దన్నరు... మూడు గంటల కరెంట్ వద్దన్నరు

- మంత్రి కెటిఆర్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కాంగ్రెస్ నోట..రైతులకు రెండో ప్రమాద హెచ్చరిక! కాంగ్రెస్ వస్తే... నిన్న ధరణి తీసేస్తం అన్న రాబందు నేడు మూడు గంటల కరెంట్ చాలు అంటున్నడు. నాడు వ్యవసాయం దండగ అన్నడు చంద్రబాబు..నేడు మూడుపూటలు దండగ అంటున్నడు ఛోటా చంద్రబాబు. మూడు ఎకరాల రైతుకు.. మూడుపూటలా కరెంట్ ఎందుకు అనడం..ముమ్మాటికీ సన్న, చిన్నకారు రైతును అవమానించడమే' అని మంత్రి కెటిఆర్ విమర్శించారు. రేవంత్ వ్యాఖ్యలకు కౌంటర్‌గా బుధవారం ఆయన ట్వీట్ చేశారు. కాంగ్రెస్‌కు ఎప్పుడూ.. చిన్నకారు రైతు అంటే చిన్నచూపు, సన్నకారు రైతు అంటే సవతిప్రేమ అని ఎద్దేవా చేశారు. నోట్లు తప్ప... రైతుల పాట్లు తెల్వని రాబందును నమ్మితే రైతు నోట్లో మట్టికొట్టుడు ఖాయం.. అన్నదాత నిండా మునుగుడు పక్కా అని ఘాటు విమర్శలు చేశారు. నాడు.. ఏడు గంటలు ఇవ్వకుండా ఎగ్గొట్టిన కాంగ్రెస్, నేడు ఉచిత కరెంట్‌కు ఎగనామం పెట్టేందుకు కుట్రలు చేస్తున్నది. మూడు గంటలతో మూడెకరాల పొలం పారించాలంటే బక్కచిక్కిన రైతు బాహుబలి మోటార్లు పెట్టాలన్నారు. అరికాలిలో మెదడు ఉన్నోళ్లను నమ్ముకుంటే రైతుల బతుకు ఆగమేనని, మరోసారి రాబందు మూడు గంటల మాటెత్తితే..రైతుల చేతిలో మాడు పగలడం ఖాయమన్నారు. 'తెలంగాణ రైతన్నలకు ఇది పరీక్షా సమయం! రైతును రాజును చేసే మనసున్న సీఎం కేసీఆర్ కావాలా? మూడు గంటలు చాలన్న మోసకారి రాబందు కావాలా? తెలంగాణ రైతుల తేల్చుకోవాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

తుది తీర్పుకు లోబడే ఆ సీట్ల భర్తీ

- హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంబిబిఎస్ మెడికల్, డెంటల్ కన్వీనర్ కోటా సీట్లను ఎపి విద్యార్థులకు ఇవ్వరాదని మొత్తం సీట్లను తెలంగాణ విద్యార్థులకే చెందుతాయని పేర్కొంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 72ను సవాల్ చేసిన కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడకు చెందిన సాయి సిరిలోచన, మరో ఇద్దరు విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ ఎన్.రాజేశ్వర్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. వారిద్దరి అప్లికేషన్లను అనుమతించాలనీ, కౌన్సెలింగ్‌కు అనుమతించాలనీ, అయితే, అడ్మిషన్లు తాము చెప్పే తుది తీర్పునకు అనుగుణంగా ఉంటాయని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 3న జారీ చేసిన జీవో 72పై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత 15 శాతం సీట్లను తెలుగు రాష్ట్రాల విద్యార్థులను ఎంపిక చేయాలని చట్టం స్పష్టం చేస్తోందని పిటిషనర్ వాదన. జాతీయ స్థాయిలో 15 శాతం సీట్లు కేటాయించాక మళ్లీ విడిగా ఏపీ విద్యార్థులకు ఎందుకు కేటాయింపు ఉండాలని హైకోర్టు వివరణ అడిగింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ వాదిస్తూ, 2014 నాటికి ఉన్న మెడికల్ కాలేజీలకు ఆ నిబంధన అమలవుతోందని, దీని ప్రకారం ఏపీ విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారనీ, 2014 తర్వాత ఏర్పాటైన కాలేజీలకు ఆ నిబంధన వర్తించదని అందుకే జీవో 72 ద్వారా తెలంగాణ విద్యార్థులకు మేలు జరిగేలా ప్రభుత్వం చేసిందని వివరించారు. ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

ఫీజుల దందాను అరికట్టాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
- రాష్ట్ర వ్యాప్త బంద్ విజయవంతం
- మంత్రుల నివాస సముదాయాల ముట్టడి ఉద్రిక్తం
- నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- ఖమ్మంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దౌర్జన్యం
- అరెస్టులపై నేడు రాష్ట్రవ్యాప్త నిరసనకు పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతమైంది. హైదరాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట, హన్మకొండ, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో శాంతియుతంగా బంద్ కార్యక్రమం చేస్తున్న విద్యార్థులను పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి అరెస్టు చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో బంద్ పాటించాలని కోరిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకత్వంపై ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం బౌన్సర్లతో దాడి చేయించడాన్ని విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీలు ఖండించాయి. అరెస్టులను ఖండిస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి.

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయాల ముట్టడికి ప్రయత్నించిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. అంతకు ముందు విరించి ఆస్పత్రి సిగ్నల్ నుంచి ర్యాలీగా విద్యార్థులు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాలు నాయకులు ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజు(ఎస్ఎఫ్ఐ), పుట్టా లక్ష్మణ్(ఎఐఎస్ఎఫ్), పరుశరాం, ఎస్.నాగేశ్వరరావు, రామకృష్ణ, మహేష్ (పిడిఎస్‌యు), మల్లేష్ (ఎఐడిఎస్ఓ), గవ్వ వంశీధర్‌రెడ్డి(ఎఐఎస్‌బి), మురళీ (ఎఐఎఫ్‌డిఎస్), విజయ్(పిడిఎస్‌యు(వి)) మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం సక్రమంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సౌకర్యాలూ లేవన్నారు. నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో టీచర్స్ లేరని, రాష్ట్రంలో 24 వేల టీచర్స్ ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు -మన బస్తీ - మన బడి పథకాన్ని అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలని కోరారు.

రాష్ట్రంలో కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల దందాను అరికట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. లక్షల రూపాయల ఫీజులు, డొనేషన్ల పేరుతో దోచుకుంటున్నా కనీసం ప్రభుత్వం తల్లిదండ్రులకు భరోసానిచ్చే ప్రయత్నం కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బడ్జెట్ పాఠశాలలకు ఎలాంటి రాయితీలూ ఇవ్వడం లేదని, కార్పొరేట్ విద్యాసంస్థల మాదిరిగా కమర్షియల్ ట్యాక్స్, కరెంట్ బిల్లులు, వాటర్ బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కనీసం కమర్షియల్ పరిధిలో నుంచి డొమెస్టిక్ పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడి సందర్భంగా పోలీసులుకు, విద్యార్థులకు తీవ్ర తోపులాట జరిగింది. లాఠీలతో విద్యార్థులను కొడుతూ.. చొక్కాలు చించి లాక్కెళ్లారు.

ఈ కార్యక్రమంలో తాటికొండ రవి, బి.శంకర్, కె.అశోక్ రెడ్డి, లెనిన్, రమేష్, స్టాలిన్, శ్రీమాన్(ఎస్ఎఫ్ఐ), క్రాంతి గ్యార, రెహమాన్, హరీష్, అన్వర్, తిరుపతి(ఏఐఎస్ఎఫ్), గణేష్, నాగరాజు, సైదులు, యశ్వంత్ (పీడీఎస్‌యు), గడ్డం శ్యామ్, గణేష్, గౌతమ్, ఆసిఫ్(పీడీఎస్‌యు), రాజు, అరవింద్ రెడ్డి, అఖిల్, అవినాష్ (ఏఐఎస్‌బి), ప్రతిభ, వెంకటేష్, సృజన్, ఉషాశ్రీ(ఏఐడీఎస్ఓ), అనిల్, సుమంత్, పవిత్ర, తిరుపతి, పాషా(పీడీఎస్‌యు), భాను, నవీన్, సాయి(ఏఐఎఫ్‌డీఎస్) తదితరుల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దౌర్జన్యం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి.

ఈ క్రమంలో ఖమ్మం నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బంద్ నిర్వహించడానికి వెళ్లిన ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్ నాయకులపై పాఠశాల యాజమాన్యం రౌడీలను పెట్టించి దాడి చేయించింది. ఈ క్రమంలో గాయపడిన వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. దాడిని సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్), ప్రజాపంథా, న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శులు ఓ ప్రకటనలో ఖండించారు. అన్ని విద్యా సంస్థలు బంద్‌కు సహకరించాయని, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం మాత్రమే సహకరించకుండా.. అక్కడికి వెళ్ళిన విద్యార్థి నాయకులపై నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరావు కిరాయి గూండాలతో దాడిచేయించి గాయపరిచారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పైగా పోలీసులకు తప్పుడు రిపోర్టు ఇచ్చి అరెస్టు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా చరిత్రలో ఏ విద్యా సంస్థా ఇటువంటి గూండాగిరికి పాల్పడలేదన్నారు. అన్ని నిబంధనలను ఉల్లంఘించి, విపరీతమైన ఫీజులతో విద్యార్థులను పీడిస్తూ, గూండాలను పెంచి పోషించి బరితెగించి వ్యవహరిస్తున్న ఢిల్లీ స్కూల్ యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు.

ప్రతి పోలీస్ స్టేషన్లలో సిసి కెమెరాలు

- హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. రాష్ట్రంలో 774 పోలీసుస్టేషన్లకుగాను ఇప్పటి వరకు 399 స్టేషన్లలో ఏర్పాటు చేశామని తెలిపింది. ఇంకా 103 స్టేషన్లలో ఏర్పాటు చేయాలని, అనుమతిచ్చినట్టు చెప్పింది. ఇదే అంశంపై సుప్రీంకోర్టు విచారణ చేస్తోందని తెలియజేసింది. ఈ వివరాలను నమోదు చేసుకున్న హైకోర్టు ఇక్కడి పిల్‌పై విచారణను ముగించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 780 పోలీసు స్టేషన్లలో 40 శాతం సీసీ కెమెరాలు నగరంలోనే ఏర్పాటు జరిగింది. నగరంలో 10,507 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో 4,402 పని చేయడం లేదు. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ మెజర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్-2013 ప్రకారం సీసీ కెమెరాల ఫుటేజీ 30 రోజులు రికార్డింగ్ అవసరమయ్యే ఏర్పాటు చేయాలి. వీటిని ఏర్పాటు చేస్తే లాకప్‌డెత్‌లు తగ్గుతాయి. ప్రజలు కూడా నిర్భయంగా పోలీసు స్టేషన్లకు వెళతారు... అని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ తరపు న్యాయవాది ఎం.రూపేందర్ వాదనలు వినిపిస్తూ పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాలకు సంబంధించిన అంశాన్ని సుప్రీంకోర్టు విచారిస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై నివేదిక సుప్రీంకోర్టు సమర్పించినట్టు తెలిపారు. సుప్రీంకోర్టు ఈ నెల 28న విచారణ చేయనుందన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పిల్‌పై విచారణ ముగించింది.

ఆదివారంనాడు కూల్చివేతలా?

- సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా అమలు చేయరా?
- హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివారం ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినప్పటికీ జీహెచ్ఎంసీ కూల్చివేత చర్యలకు పాల్పడడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. తమ ముందున్న పిటిషనర్‌కు చెందిన నిర్మాణాలు కూల్చివేయవద్దన్న మధ్యంతర ఉత్తర్వులు ఉన్నప్పటికీ కూల్చివేత చర్యలకు పాల్పడటంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. విచారణకు స్వయంగా హాజరుకావాలని ఆదేశించినా అధికారులు లెక్కలేకుండా వ్యవహరించడంపై నిప్పులు చెరిగింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని కోర్టు ఆదేశించినా జీహెచ్ఎంసీ అధికారులు తమ డెక్కన్ కిచెన్‌ను కూల్చివేశారంటూ జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్‌లో డబ్ల్యు3 హాస్పిటాలిటీ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ హైకోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. దీనిని జస్టిస్ కె.లలిత విచారణ చేపట్టిన సందర్భంగా పైవిధంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గత విచారణ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రవితేజ, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రాజ్‌కుమార్ స్వయంగా హాజరుకావాలని ఆదేశిస్తే.. విచారణకు రవితేజ, రాజ్‌కుమార్ మాత్రమే హాజరయ్యారు. లోకేశ్‌కుమార్ మాత్రం అత్యవసర సమావేశం కారణంగా రావడం లేదని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అంత అత్యవసరంగా ఆదివారం కూల్చివేయాల్సిన అవసరం ఏముంది?. సెలవు రోజుల్లో ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయి కదా. ప్రతివాదులందరూ కోర్టు ధిక్కరణ ఎదుర్కోవాల్సిందే. తదుపరి విచారణకు లోకేశ్‌కుమార్, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ప్రతివాదులందరూ హాజరుకావాల్సిందే. కూల్చివేతకు సంబంధించి అనుసరించిన నివేదికను అందజేయాలి' అని ఆదేశించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

బకాయిలు చెల్లించండి

- మూడో రోజూ కొనసాగిన మధ్యాహ్న భోజన కార్మికుల టోకెన్ సమ్మె

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు చెల్లించాల్సి పెండింగ్ బకాయిలను చెల్లించాలని, కొత్త మెనూకి అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ రమ డిమాండ్ చేశారు. యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన మూడు రోజుల టోకెన్ సమ్మెలో భాగంగా బుధవారం పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వందలాది మంది జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట బైఠాయించి మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.పద్మ అధ్యక్షతన జరిగిన సభలో రమ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం బతికి ఉండటానికి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేస్తున్న శ్రమే కారణమని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అసెంబ్లీలో ప్రకటించిన తేదీ నుంచి ఏరియర్స్‌తో కలిపి పెంచిన రూ.2000 వేతనాన్ని అమలు చేయాలన్నారు. కొత్తగూడెం జిల్లాలో 9 కోట్ల రూపాయల పైచిలుకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు ఉంటే వంటలు ఎలా వండి పెట్టగలరని ప్రశ్నించారు. రాష్ట్రంలో రోజుకి 30 రూపాయల వేతనంతో పనిచేస్తున్న కార్మికులు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మాత్రమేనని, ఇది తెలంగాణ రాష్ట్ర పరిపాలనకు సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని లేకుంటే, పోరాటాన్ని ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వందలాంది మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగగా.. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణు, కళ్యాణం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. యుటిఎఫ్ జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నల్లగొండలో జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ధర్నా చేపట్టారు. మహబూబాబాద్ జిల్లాలో స్థానిక ఎంఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలపై సిఎంకు జూలకంటి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రకటించిన కాలం నుంచి రూ.రెండు వేలు చెల్లించాలని కోరారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలనీ, కొత్త మెనూ, గుడ్డుకు బడ్జెట్‌ను పెంచాలనీ, చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు గతేడాది మార్చి 15న అసెంబ్లీలో వేతనం రూ.రెండు వేలు పెంచుతున్నట్టు ప్రకటించారని గుర్తు చేశారు. అనేక విజ్ఞప్తుల మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి మూడున జీవోనెంబర్ ఎనిమిదిని జారీ చేశారని తెలిపారు. కానీ అసెంబ్లీలో ప్రకటించిన కాలం నుంచి పెంచిన వేతనం ఇస్తున్నట్టు ఆ జీవోలో స్పష్టం చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన వేతనం అమలు చేయకపోగా, ఇస్తున్న రూ.వెయ్యి కూడా పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడం వల్ల కార్మికులు అప్పులపాలవుతున్నారని వివరించారు. ప్రభుత్వం ఇస్తున్న బడ్జెట్ సరిపోవడం లేదంటూ మొత్తుకుంటుంటే కొత్తగా కిచిడీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, వెజిటబుల్ బిర్యానీ, వారానికి మూడు గుడ్లు పెట్టాలంటూ మెనూ రూపొందించారని తెలిపారు. అదనపు బడ్జెట్ కేటాయించకుండా నిర్ణయించిన మెనూ, గుడ్డు పెట్టడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ పథకానికి బడ్జెట్ తగ్గించడం, మూడు గుడ్లు పెట్టలేదన్న సాకుతో వేధింపులున్నాయని తెలిపారు. గుడ్డు పెట్టకపోయినా స్వచ్ఛంద సంస్థలకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, గండిపేట, మొయినాబాద్, రాజేంద్రనగర్ మండలాల్లో 190 పాఠశాలలను అక్షయపాత్రకు ఇవ్వాలని నిర్ణయించారని పేర్కొన్నారు. కార్మికులకు ఉపాధి లేకుండా చేయడం దారుణమని విమర్శించారు. దీంతో కార్మికులు ఆందోళనతో ఉన్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలనీ, గుర్తింపు కార్డులివ్వాలనీ, కాటన్ బట్టలివ్వాలనీ, వంట షెడ్లు, పాత్రలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలనీ, అక్రమ తొలగింపులు అరికట్టాలనీ, రాజకీయ వేధింపుల్లేకుండా చూడాలని కోరారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై త్వరలో సెమినార్: టిడబ్ల్యూజెఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం తీర్మానించింది. సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలని సిఎం కెసిఆర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టులు, సంఘాలు, సొసైటీలతో ఈ నెలాఖరులోగా సెమినార్‌ను నిర్వహిస్తామని తెలియజేసింది. ఆ సంఘం సీనియర్ ఉపాధ్యక్షులు టి. కృష్ణ అధ్యక్షతన సమావేశంలో ఫెడరేషన్ గత కార్యకలాపాల నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య సమర్పించారు. ఈ సందర్భంగా ఇండ్లస్థలాల విషయమై ఆఫీసు బేరర్లు సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించారు. ఇండ్ల స్థలాలపై త్వరలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యక్షులు పి.రాంచందర్, పి.ఆనందం, వి.జగన్, రఘు,, రాజశేఖర్, విజయానంద్, కార్యదర్శులు ఇ. చంద్రశేఖర్, గంద్ర నవీన్, సలీమ, నిరంజన్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగోన్నతులు

- 15 రోజుల్లోగా డిప్యూటీ సివిల్, సివిల్ సర్జన్లకు
- నెల రోజుల్లో టివివిపి నర్సులకు కూడా ప్రమోషన్లు
- అధికారులకు మంత్రి హరీశ్ రావు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలోని పలు విభాగాలు, పలు కేడర్లలో పని చేస్తున్న వారికి నిర్దేశించిన వ్యవధిలో ఉద్యోగోన్నతులను కల్పించాలని ఆ శాఖ మంత్రి హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బోధనాస్పత్రుల్లో 190 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించే ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రొఫెసర్ నుంచి అడిషనల్ డిఎంఇగా ఉద్యోగోన్నతి పొందేందుకు ఉన్న వయోపరిమితిని 57 ఏళ్ల నుంచి 64 ఏళ్లకు పెంచాలని నిర్ణయించారు. ప్రొఫెసర్ల బదిలీలకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే పంపాలని రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె రమేశ్‌రెడ్డిని ఆదేశించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని మొత్తం 112 డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ సర్జన్ ఉద్యోగోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టి 15 రోజుల్లోగా పూర్తి చేయాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. ఆ విభాగంలోనే 371 నర్సుల ప్రమోషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వచ్చే పది రోజుల్లో లోకలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి, నెల రోజుల్లో ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్లకు సంబంధించిన ఉద్యోగోన్నతుల ప్రక్రియనూ వేగవంతం చేయాలని కోరారు.

పిఎంపి, ఆర్ఎంపిల శిక్షణ అంశంపై కమిటీ

హైకోర్టు ఆదేశాలకు లోబడి పిఎంపి, ఆర్ఎంపిలకు శిక్షణ ఇచ్చే విషయంపై పూర్తి నివేదిక రూపొందించేలా కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఆ కమిటీ వారం రోజుల్లో తన నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

32 సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ మిషన్ల కొనుగోలు

డెంగ్యూ వ్యాధి చికిత్సలో ఉపయోగించే 32 సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ల మిషన్లను రూ.పది కోట్లతో కొనుగోలు చేయాలని హరీశ్ రావు ఆదేశించారు. వాటిని అన్ని జిల్లా ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయాలని కోరారు. వీటితో సకాలంలో రోగనిర్ధారణ జరిగి సత్వర చికిత్స చేసేందుకు వీలవుతుందని తెలిపారు.

ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన నూతన వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. నిమ్స్ నూతన భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కొత్తగా సమకూర్చుకున్న 228 అమ్మఒడి వాహనాలు, రెండు వందల నాలుగు 108 వాహనాలు, 34 హార్సే వాహనాలను ఆగస్టు ఒకటో తేదీన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ తదితరులు పాల్గొన్నారు.

వేతన పెంపు జిఒ 60 అమలు చేయాలి

- కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు
- రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని, వేతన పెంపు జీవో 60ను అమలు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. వేతనాల పెంపు, పర్మినెంట్, మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. పోటీ కార్మికులతో పనులు చేయించేందుకు అధికారులు యత్నించడమే కాకుండా విధుల్లో నుంచి తొలగిస్తామంటూ బెదిరించినా వెనక్కి తగ్గకుండా తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేస్తున్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా కీసర ఎంపిడిఒ ఆఫీస్ ఎదుట సమ్మెకు కెవిపిఎస్ జిల్లా నాయకత్వంతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు సంఘీభావం ప్రకటించారు. అనంతరం కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పెంపు జిఒ 60ని పకడ్బందీగా అమలు చేసి వారికి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులతో వెట్టిచాకిరీ చేయించే జీవో 51ని రద్దు చేసి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. తక్షణమే గ్రామ పంచాయతీ కార్మికులను చర్చలకు ఆహ్వానించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఖమ్మం జిల్లా తల్లాడలో జీపీ కార్మికుల దీక్షలకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మానవతరాయి సంఘీభావం తెలిపారు. కొణిజర్ల, వేంసూరులో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు.

కనీస వేతనాల జిఒను సవరించాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు కనీస వేతనాలు సవరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ డిమాండ్ చేశారు. చిన్న మధ్య తరగతి పరిశ్రమల్లో కనీస వేతనాల జీవో సవరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ నెల 4 నుంచి 13 వరకు సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాత బుధవారం హైదరాబాద్ జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. కార్మికుల సమస్య పరిష్కారం కోసం ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, కాంట్రాక్టు కార్మికుల చట్టబద్ధ సౌకర్యాలు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వలస

కార్మికులకు 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం ప్రకారం హక్కులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జి.అశోక్ నాయకులు, శ్రీనివాస్, సందీప్, దేవదానం, కరుణాకర్, మల్లారెడ్డి, వెంకయ్య, రమణ పాల్గొన్నారు. అనంతరం జాతా బాలానగర్ పారిశ్రామిక ప్రాంతం, సనత్‌నగర్ క్లస్టర్‌లో సాగింది. పలు పరిశ్రమల కార్మికులను నేతలు కలిసి సమస్యలు తెలుసుకున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ సంయుక్త కార్యాచరణ సమితి జెఎసి ఆధ్వర్యంలో రెండో దశ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద పెన్షనర్లు బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింపజేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్కీమ్‌ను యూనివర్సిటీ, రిటైర్డ్ కాలేజీ టీచర్స్, జీహెచ్ఎంసీ, ఎయిడెడ్ మార్కెట్ కమిటీ పెన్షనర్లకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. పెన్షనర్ల భవన్ నిర్మాణం, కార్యాలయ నిర్వహణ ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు హైదరాబాద్‌లో వెయ్యి గజాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒక ప్రత్యేక ఇంక్రిమెంటు ఇచ్చి గుర్తించారని.. అదే ఉద్యమంలో పెన్షనర్లు అందరూ పాల్గొని తమ వంతు పాత్ర పోషించారని గుర్తు చేశారు. వారికి కూడా తెలంగాణ ఇన్సెంటివ్ ఇచ్చి గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ సంయుక్త కార్యాచరణ సమితి చైర్మన్ కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ వెట్టిచాకిరీ!

- పర్మినెంట్ లేదు.. జీతాల పెంపూ లేదు
- మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి
- జిఓ నెం.60 అమలుకు గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళన
- సమ్మె చేస్తున్నా స్పందించని సర్కార్
- కొత్త వారిని పెట్టుకుంటామని అధికారుల బెదిరింపులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఏండ్లకేండ్లు గడుస్తున్నా పర్మినెంట్ లేదు.. చేసే పనికి భద్రత లేదు.. కష్టానికి తగిన ఫలితమూ చేతికందడం లేదు.. పైగా మల్టీపర్పస్ విధానం తీసుకొచ్చి గ్రామ పంచాయతీల్లో అన్ని రకాల పనులూ చేయిస్తున్నారు.. జీతాలు పెంచకపోగా.. కొత్తగా విధుల్లోకి తీసుకునే కార్మికులకు పాత కార్మికుల వేతనాల్లో నుంచే పంచి ఇస్తున్నారు.. ఇదేం తిరకాసు.. ఇలాగైతే ఎలా బతకాలి.. కుటుంబాలు గట్టెక్కేదెలా.. అంటూ గ్రామ పంచాయతీ కార్మికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.. తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం జీఓ నెం.60 అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు సంబంధించి కుటుంబాలకు రూ.పది లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టారు. వారికి సిఐటియుతో పాటు పలు ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. కార్మికులు విధులను బహిష్కరించడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. అయినా సర్కార్ స్పందించడం లేదు. గ్రామాల్లో చెత్త పేరుకుపోయింది. పనులు ఆగిపోయాయి. వ్యాధులు విజృంభిస్తున్నాయి. అయినా సమస్యను పరిష్కరించే ఆలోచన చేయకుండా బెదిరింపులకు దిగుతూ.. వారిని తొలగించి కొత్త వారిని తీసుకోవాలని అధికారులు గ్రామ పంచాయతీలను ఆదేశిస్తున్నారు. కొత్త వారిని పనిలో పెట్టుకుని పోలీసుల ఆధ్వర్యంలో చెత్తను

ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తొలగించే ఏర్పాట్లు చేస్తున్నారు. గొడవలు చెలరేగడంతో వెనక్కు తగ్గారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో 250 గ్రామ పంచాయతీల పరిధిలో 1170 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో స్వీపర్లుగా, పంప్ ఆపరేటర్లుగా, ఎలక్ట్రీషియన్లుగా, డ్రైవర్లుగా, కారోబార్లుగా, బిల్ కలెక్టర్లుగా పనిచేస్తున్నారు. వీరంతా పేద, బలహీన వర్గాలకు చెందిన వారే. గ్రామాల్లో చెత్తాచెదారం, మానవులు, జంతువుల మళం, కుళ్లిపోయిన శవాల తొలగింపు, మురుగు కాల్వలను శుభ్రం చేస్తూ నిత్యం మలినాల మధ్య పని చేస్తున్నారు. ఇన్ని పనులు చేస్తున్నా వేతనాల పెంపులేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

స్వచ్ఛభారత్ పేర బిజెపి ఫోజులు..

స్వచ్ఛ భారత్ పేరుతో బిజెపి ప్రభుత్వం అట్టహాసంగా కార్యక్రమాలు ప్రారంభిస్తూ పోజులిస్తూ వాటి యాడ్స్ కొరకు వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేస్తుందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి : శివమ్మ, స్వీపర్, కాకులారం

గ్రామ పంచాయతీల్లో వెట్టిచాకిరీ చేస్తున్న కార్మికులకు విముక్తి కలిగించాలి. ప్రతి కార్మికున్నీ పర్మినెంట్ చేయాలి. కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు అందజేయాలి.

జిఓ నెం.60 అమలు చేయాలి : రవి, డ్రైవర్, జిల్లెడుబండ

జిఓ నెం.60 ప్రకారం ప్రభుత్వం కార్మికులకు రూ.19,600 వేతనాన్ని ఇవ్వాలి. జిఓ నెం.51ని సవరించాలి. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి.

ప్రమాద బీమా రూ. పది లక్షలు ఇవ్వాలి
రాఘవేంద్ర, కార్మిక సంఘం మండల అధ్యక్షులు, గద్వాల

ప్రమాదం జరిగి మరణించిన కార్మికునికి సంబంధించి కుటుంబానికి ప్రభుత్వం రూ. పది లక్షలు చెల్లించాలి. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి. దహన సంస్కారాలకు రూ.30వేలు అందజేయాలి.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
వెంకటస్వామి, సిఐటియు జిల్లా కార్యదర్శి, జోగులాంబ గద్వాల

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. గ్రామ పంచాయతీ సిబ్బందికి అన్ని కార్మిక చట్టాలు వర్తింపజేయాలి. 8గంటల పని దినాలు అమలు చేయాలి. ఆదాయం ఉన్న పంచాయితీలలో వేతనాల పెంపునకు అనుమతివ్వాలి. వయోభారంతో తొలగించిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలి.

భవనాన్ని ప్రారంభిస్తున్న హిమాన్స్, ప్రజాప్రతినిధులు

దత్తత స్కూల్లో 'హిమాన్స్' జన్మదిన వేడుకలు

- రూ.కోటితో నిర్మించిన భవనం ప్రారంభం
- నేటి యువతకు స్ఫూర్తి - మంత్రి సబిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ మనుమడు ఓ క్రిడ్జ్ పాఠశాల సిఎఎస్ అధ్యక్షులు హిమాన్షు. బుధవారం తన జన్మదినం సందర్భంగా తాను దత్తత తీసుకున్న గచ్చిబౌలి డివిజన్ కేశవ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ విఫ్ గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి హిమాన్షు నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, సీఎస్.. హిమాన్షుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంత ఎదిగినా.. ఒదిగి ఉండటం.. హిమాన్షు గొప్పతనమని, విద్యార్థులతో ఓ సామాన్యునిగా కలిసిపోయి జన్మదిన వేడుకలు జరుపుకోవడం నేటి యువతకు స్ఫూర్తి అని అభినందించారు. నూతనంగా నిర్మించిన పాఠశాలలో అంగన్‌వాడీ నుంచి డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు పేద విద్యార్థులే వస్తారని, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సిఎం కెసిఆర్ చెబుతుంటారని, అందులో భాగంగా రాష్ట్రంలోని 26 వేల పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించటానికి రూ.7200 కోట్లపై చిలుకు నిధులు కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్‌పుస్తకాలు అందిస్తూ, డ్రెస్సులు ఇస్తూ, ఉదయం పూట రాగి జావాను అల్పాహారంగా అందిస్తున్నారని తెలిపారు. చాలా మంది ఇంగ్లీష్ మీడియం కోసమే ప్రయివేటు పాఠశాలలకు పోతున్నారని, కెసిఆర్ గతేడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన ప్రారంభించారని తెలిపారు. 1000 గురుకులాలు స్థాపించి, వాటిలో పాత వాటితో కలుపుకుని 1200 గురుకులాలు జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. అన్ని శాఖల్లో కలిపి 1,450 జూనియర్ కళాశాలలు ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ నా మనుమడు ఏ బియ్యంతో తింటే అదే బియ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తినాలని చెప్పారని, నేటికి అదేవిధంగా అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా రాణించేలా తయారు కావాలన్నదే ముఖ్యమంత్రి కెసిఆర్ ఆకాంక్ష అని, ఆ దిశగా నేడు అడుగులు పడ్డాయన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలు బోధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసిన అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఓ క్రిడ్జి ఇంటర్నేషనల్ పాఠశాల ప్రిన్సిపాల్ దీపికారావు, సిఎఎస్ కో-ఆర్డినేటర్, ఇతర టీం సభ్యులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- మంత్రి సత్యవతికి టిఎజిఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కోరింది. ఈ మేరకు బుధవారం టిఎజిఎస్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపి మిడియం బాబురావు, రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, ఎస్ కృష్ణారెడ్డిలు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాది మే 5, 6 తేదీల్లో టిఎజిఎస్ రాష్ట్ర మూడో మహాసభలు భద్రాచలం పట్టణంలో జరిగాయని వారు ఈ సందర్భంగా ఆమెకు తెలిపారు. ఈ సభల్లో రాష్ట్రంలోని గిరిజన తెగల సమస్యలు-పరిష్కారానికి చేయాల్సిన కృషిని గురించి చర్చించి 14 తీర్మానాలను ఆమోదించినట్టు చెప్పారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

'దరఖాస్తు చేసిన పోడు సాగుదారులందరికి సర్వే చేసి హక్కు పత్రాలు వెంటనే జారీ చేయాలి. ఆదివాసుల భూమి, ఉపాధి, సంస్కృతి, పరిరక్షణ కోసం 1/70, పిసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. గర్తించిన ప్రతి ఆదివాసీ కుటుంబానికి అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలి. ఆహార భద్రత కల్పించాలి. ప్రతి గిరిజన గూడేనికి మెరుగైన వైద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి. ప్రతి జిల్లాకు ఒక ఐటిడిఎ ఏర్పాటు చేయాలి. గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. ఆదివాసీలకు మాతృభాషలోనే ప్రాథమిక విద్యనందించాలి. ఏజెన్సీలోని అన్ని పాఠశాలల్లో శిక్షణ పొందిన వాలంటీర్లను (బోధకులను) నియమించాలి.... ' అనే ప్రధాన డిమాండ్లను వారు మంత్రికి అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

టియులో విజిలెన్స్ తనిఖీలు

- నిధుల దుర్వినియోగంపై మూడోసారి విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ గుప్తా హయాంలో ఈసీ అనుమతి లేకుండా రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ విద్యావర్ధినితో పాటు మరో ఎనిమిదిమంది అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, సాయాగౌడ్, సూపరిండెంటెండ్ భాస్కర్, ఏఈ వినోద్, బిక్నూర్ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవితా తోరణ్, సీవోఈ ప్రొఫెసర్ ఆరుణ శాంతాబాయి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ మధులికను విచారించారు. అక్రమ వస్తువుల కొనుగోళ్లు, పాలక మండలి అనుమతులు తీసుకోకుండా నిధులు దుర్వినియోగం చేయడంపై విచారణ చేశారు. రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ విద్యావర్ధిని.. కొనసాగిన సమయంలో జరగిన కొనుగోళ్లపై వారిని వేర్వేరుగా సుమారు మూడు గంటల పాటు విజిలెన్స్ అధికారులు విచారించారు. ప్రొఫెసర్ విద్యావర్ధిని కేరీర్ అడ్వాన్స్ స్కీం పేరిట రూ.11లక్షలు డ్రా చేశారన్న ఆరోపణలపై అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయం సమాచారం. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ గుప్తా నియామకం నుంచి ఆయన ఏసీబీ అధికారులకు పట్టుబడి అరెస్టయి జైలుకు పోయే వరకు యూనివర్సిటీలో జరిగిన వస్తువుల కొనుగోళ్లపై పాలనాపరమైన విధులు నిర్వహించిన అధ్యాపకులను అధికారులు విచారించారు. కాగా, యూనివర్సిటీలో వీసీ రవీందర్ గుప్తా పాలక మండలి ఆమోదం లేకుండా ఇష్టానుసారంగా అక్రమ వస్తువులు కొనుగోళ్లు చేస్తున్నారని వీసీపై చర్యలు తీసుకోవాలని ఈసీ సభ్యులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో మొదటి సారి జూన్ ఆరున వర్సిటీలో విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో పలు విభాగాల్లో సోదాలు నిర్వహించి కంప్యూటర్లు, హర్డ్ డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. రెండో దఫా జూన్ 13న వర్సిటీలో సోదాలు నిర్వహించి పలు కీలకమైన వివరాలు రాబట్టారు. మరోసారి జూన్ 17న ఏసీబీ అధికారులు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ కార్యాలయంలో సోదాలు నిర్వహించి వర్సిటీ పరిధిలోని కళాశాలల వివరాలు, ఇతర విషయాలపై విచారణ చేశారు. తదనంతరం తాజాగా మూడోసారి విజిలెన్స్ అధికారులు బుధవారం ఉదయం 11గంటలకు చేరుకొని అధ్యాపకులను, మాజీ రిజిస్ట్రార్‌లను విచారించారు. ఇందుకు ఒక్క రోజు ముందుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి విజిలెన్స్ అధికారులు సమాచారం ఇచ్చి ఇద్దరు మాజీ రిజిస్ట్రార్లతో పాటు మరో ఎనిమిదిమంది అధ్యాపకులు, అధ్యాపకేతరలను అందుబాటులో ఉండేలా సమాచారం ఇవ్వాలని సూచించారు. దాంతో రిజిస్ట్రార్ యాదగిరి ఫోన్ ద్వారా వారందరికి సమాచారం అందజేశారు. కాగా, విచారణ వివరాలు వెల్లడించడానికి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిరాకరించారు.

యాదాద్రికి ఎస్‌బిఐ మూడు వాహనాల అందజేత

హైదరాబాద్ : కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) యాదాగిరిగుట్టలోని లక్ష్మీ నరసింహా స్వామి ఆలయానికి బ్యాటరీలతో కూడిన మూడు వాహనాలను అందించింది. వీటికి సంబంధించిన తాలం చెవులను ఎస్‌బిఐ సిజిఎం రాజేష్ కుమార్ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్ గీతాకు అందజేశారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

- ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన తెనుగు మహేశ్వరి, దత్తాత్రి దంపతుల చిన్న కుమారుడు ఉదయ్ తేజ్ మెదక్‌లోని ఓ ప్రయివేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. పాఠశాల నుండి తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత బాలుడి ముఖంపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన కుటుంబీకులు వెంటనే బాలుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న నలుగురు నిందితుల అరెస్ట్

- 90 కిలోల గంజాయి, కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గంజాయిని స్మగ్లింగ్ చేసే సమయంలో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు కారును మాడిఫై చేసి ఏజెన్సీ నుంచి తరలిస్తున్న నలుగురు స్మగ్లర్లను నార్కోటెక్ ప్రత్యేక బృందం, పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.25లక్షల విలువగల 90కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డిసిపి జి చక్రవర్తి వివరాలు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతపల్లికి చెందిన వి రాజారావు, వి బాలాజీ, ఈస్ట్‌గోదావరికి చెందిన ఎ సాయి శివకుమార్, తెలంగాణ సంగారెడ్డి జిల్లాకు చెందిన రాథోడ్ వెంకట్ స్నేహితులు. సులువుగా డబ్బులు సంపాధించడం కోసం గంజాయి స్మగ్లింగ్ చేయాలని నిర్ణయించుకున్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు వారి కారును ముందు, వెనుకాల బంపర్లను, డిక్కీని మార్చారు. విశాఖ ఏజెన్సీ నుంచి హైదరాబాద్, శివారు ప్రాంతాలకు గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న టిఎస్-ఎన్ఎబి ఇన్‌స్పెక్టర్ పి రమేష్ రెడ్డి, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ లాలూ నాయక్ నిందితులపై ప్రత్యేక నిఘా వేశారు. పటాన్‌చెరు ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి యువకులకు, విద్యార్థులకు విక్రయిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. పిల్లలు ఏం చేస్తున్నారు, ఎటు వెళ్తున్నారో గమనించాలని, వారితో సమయం గడపాలని డిసిపి జి చక్రవర్తి అన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- బిజెపియేతర పార్టీలన్నీ ఏకం కావాలి
- రాజకీయ శిక్షణా తరగతుల్లో జూలకంటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని జెఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో బుధవారం సిపిఎం నియోజవర్గస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంకుశ పాలన చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే విధానం, ఒకే పార్టీ.. ఒకే ప్రభుత్వం ఉండాలని మోడీ ప్రయత్నాలు చేస్తున్నారని, అందులో భాగంగానే దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రజల మధ్య చిచ్చు రేపి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ సంస్థలను, ఆర్ఎస్ఎస్ విధానాలను, కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని రాజ్యాన్ని ఏలుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకపోగా.. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి మోడీ అధికారంలోకి వస్తే దేశాన్ని అమ్మకానికి పెడతారని చెప్పారు. మోడీని గద్దె దింపేందుకు ప్రతిపక్ష రాజకీయ పార్టీలన్నీ ఏకం కావాలని కోరారు. జాతీయ పార్టీలకు ప్రాంతీయ పార్టీలు మద్దతు తెలిపి మోడీ వ్యతిరేక విధానాలను ప్రజలకు గురించి చైతన్యపరచాలని కోరారు. మోడీ అవలంబిస్తున్న విధానాలను ప్రజలు అర్థం చేసుకున్నారని, ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గ్రామపంచాయతీ సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ- ప్రజాసంఘాల నిర్మాణం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు-పర్యవసానాలుపై సోమయ్య, మిరియం వెంకటేశ్వర్లు బోధించారు. ప్రిన్సిపల్‌గా వీరేపల్లి వెంకటేశ్వర్లు వ్యవహరించగా.. రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, సీనియర్ నాయకులు జగదీష్ చంద్ర, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, డా మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, వినోద్ నాయక్, తిరుపతి రామ్మూర్తి, పరుశరాములు, రాగిరెడ్డి మంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జూలకంటి

రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి : కవిత

విద్యుత్ సౌధ వద్ద ఆందోళన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉచిత విద్యుత్‌పై వ్యాఖ్యలు చేసిన టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బిఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ రైతులకు అవసరమా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారని.. మరి వ్యాపారులకు 24 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వాలా అని ప్రశ్నించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టి విద్యుత్ వ్యవస్థను బాగు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ రైతులకు ఏం న్యాయం చేయలేదని.. ఆ రెండు పార్టీల్లో రేవంత్ రెడ్డి పనిచేశారని చెప్పారు. రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని ప్రకటించిన రేవంత్ రెడ్డిని తరిమికొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు కవిత, సంగీత, వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని ఆందోళన చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

మైనర్ ప్రేమికుల ఆత్మహత్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలిసీ తెలియని వయసులో ప్రేమలో పడ్డ మైనర్లు.. తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరేమోనన్న భయంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట 10వ వార్డులో బుధవారం వేకువజామున జరిగింది. స్థానికులు, దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన తొట్ల రేణుక వెంకటేశం దంపతుల కూతురు నేహ(16), దుబ్బాకలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. పురపాలికలోని లచ్చపేట పదో వార్డు కౌన్సిలర్ కూరపాటి బంగారయ్య పెద్ద కుమారుడు వనప్రియ రవికాంత్ దంపతుల కుమారుడు భగీరథ్ (17) అదే కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య ప్రేమవ్యవహారం నడుస్తోంది. విషయం తెలుసుకున్న ఇరువురి తల్లిదండ్రులు ప్రేమ వ్యవహారం ఇప్పుడే వద్దని, చదువుపై దృష్టి పెట్టాలని నచ్చజెప్పారు. దాంతో తమను విడదీస్తారేమోనని మనస్తాపం చెందారు. లచ్చపేటలో భగీరథ్ ఇంట్లోని ఓ దూలానికి ఇరువురు తమ మెడకు చున్నీలు బిగించుకుని ఉరేసుకున్నారు. విషయం తెలిసిన ఇరువురి తల్లిదండ్రులు బోరున విలపించారు. రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి. ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం కోసం దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఇరువురి కుటుంబాలను మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పరామర్శించారు.

ఓరుగల్లు హాట్.. హాట్..

- కడియం శ్రీహరి, రాజయ్య మధ్య ఆరని మంటలు
- సీనియర్ నేతల మధ్య లేని సఖ్యత
- బిఆర్ఎస్‌లో టికెట్ల లొల్లి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికార బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత విబేధాలు రచ్చకెక్కుతున్నాయి. ఆశావహులు ఒకవైపు, ప్రజావ్యతిరేకత మరోవైపు బహిర్గతమవుతున్నది. పార్టీ టికెట్‌ల కోసం ఆశావహులు వ్యూహ ప్రతివ్యూహాలతో పావులు కదుపుతున్నారు. దాంతో అన్ని రాజకీయ పార్టీల కంటే కారు పార్టీలోనే రాజకీయం వేడెక్కింది. ఏ నియోజకవర్గంలో చూసినా ఇదే పరిస్థితి.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. దాంతో ఈ వివాదంపై మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి కెటిఆర్ 'తాటికొండ' ను పిలిచి మరీ క్లాస్ తీసుకున్నారు. ఇలాంటివి మళ్లీ పునరావృతమైతే ఎవరినీ ఉపేక్షించమని హెచ్చరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని మహబూబాబాద్, డోర్నకల్, ములుగు నియోజకవర్గాల్లోనూ బిఆర్ఎస్‌లో పార్టీ నేతల మధ్య తీవ్ర విభేదాలున్నాయి. మహబూబాబాద్‌లో ఎంపి కవిత పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో సీనియర్ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్‌ను తండాల్లో అభివృద్ధి పనులపై స్థానికులు నిలదీస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నియోజకవర్గం నుంచి మంత్రి సత్యవతి రాథోడ్ పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. జనగామ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కుటుంబ వ్యవహారాలు రచ్చకెక్కాయి. మరోపక్క ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వచ్చే శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి పోటీ చేయాలని అన్ని ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

మానుకోటలో సిట్టింగ్‌కు ఎసరు..

మహబూబాబాద్ (ఎస్‌టి) నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అనుసరిస్తున్న విధానాలు, ప్రవర్తనపై పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపి కవితల మధ్య రాజకీయ విభేధాలున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు పార్టీ టికెట్ ఇవ్వొద్దని, కొత్తవారికి ఎవరికి ఇచ్చినా గెలిపిస్తామని పార్టీ నేతలు రహస్య సమావేశం నిర్వహించి ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఎవరితోనూ సఖ్యతతో ఉండకపోవడం కూడా వివాదాలకు కారణమవుతోంది. మంత్రికి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపి కవితల మధ్య సయోధ్య లేకపోవడం పార్టీకి నష్టదాయకంగా పరిణమించింది.

ములుగులో బిఆర్ఎస్ అభ్యర్థి ఎవరు?

ములుగు నియోజకవర్గం (ఎస్‌టి)లో బిఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది నేటికీ తేలలేదు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరినీ నియమించకపోవడంతో ఆశావహులు సైతం అసంతృప్తితో ఉన్నారు. ములుగు జెడ్‌పి చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కుసుమ జగదీశ్ అనారోగ్యంతో మృతిచెందడంతో పార్టీ వ్యవహారాలు స్తబ్ధుగా ఉన్నాయి. జడ్‌పి ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్‌గా వైస్‌చైర్మన్‌గా ఉన్న బడే నాగజ్యోతి కొనసాగుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంత్రి కెటిఆర్ పర్యటనలో స్వయంగా వేదికపై బడే నాగజ్యోతిని ముందుకు వచ్చి కూర్చోవాలని కోరారు. దాంతో వచ్చే శాసనసభ ఎన్నికల్లో పార్టీ టికెట్ నాగజ్యోతికే ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. మాజీ ఎంపి సీతారాంనాయక్‌తోపాటు పోరిక గోవింద్ నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య టికెట్ ఆశిస్తున్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే సీతక్క బలమైన నాయకురాలు కావడంతో ఆమెకు దీటైన అభ్యర్థి కోసం పార్టీ అన్వేషిస్తుందని సమాచారం. తొలుత సీతక్కను బిఆర్ఎస్‌లో చేర్చుకునే ప్రయత్నాలు చేసినా అవి కొలిక్కిరాలేదు.

జనగామలో 'ముత్తిరెడ్డి' కుటుంబ కలహాలు

జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై స్వయానా కూతురే భూ కబ్జా ఆరోపణలు చేయడం అధికారపార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఇదే క్రమంలో కొన్ని నెలలుగా నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తనదైన శైలిలో చాప కింద నీరులా నెట్‌వర్క్‌ను విస్తరింపచేసుకున్నారు. అందరికీ నిత్యం టచ్‌లో ఉంటూ.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఇవ్వడం, సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించడం, మంత్రి కెటిఆర్‌కు సన్నిహితుడిగా పేరుండటంతో వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి 'పోచంపల్లి' అని ప్రచారం జరుగుతోంది.